# సెంటిమెంట్లు

ఇ.టి. రామారావు



ఆఫీసు గడియారం ఐదు గంటలు కొట్టింది. పేపర్లన్నీ టేబిల్ డ్రాయరులో సర్దిపెట్టి టైప్ మిషన్ కవర్ వేసింది సుమతి. ప్యూన్ రంగనాథం ఆమె టేబిల్ దగ్గరకొచ్చి "మిమ్మల్ని ప్రొప్రయిటర్ గారు రమ్మంటున్నారు" అన్నాడు.

'ఇప్పుడా?' అనుకున్నది మనస్సులో.

ప్రొప్రయిటర్ అని వ్రాసి వున్న క్యాబిన్‌లోకి ప్రవేశించింది. రివాల్వింగ్ కుర్చీలో విలాసంగా కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు రవీంద్ర. ఆమెను చూస్తూనే "కూర్చోండి మిస్ సుమతీ!" అంటూ కుర్చీ చూపించాడు. మాట్లాడకుండా కూర్చుంది సుమతి అతను చెప్పేది వినడానికి సిద్ధంగా.

"ఈ టైంలో పిలిచి మిమ్మల్ని యిబ్బంది పెట్టినందుకు మన్నించండి. ఆఫీసు పని గురించి కాదు మిమ్మల్ని పిలిపించింది. కాసేపు మీతో ఒంటరిగా మాట్లాడుదామని. జస్ట్ లైక్ దట్" అన్నాడు. అతని మాటల్లో అభ్యర్థన, గౌరవం కంటె అధికారం స్పష్టంగా ధ్వనించడం సుమతి గమనించకపోలేదు.

"నేను సీట్లోకి వచ్చి నెలరోజులు కావస్తున్నది. మన ఆఫీసులో స్టాఫ్ ఎంతో క్రమ శిక్షణతో, శ్రద్ధతో పనిచేస్తున్నారు. ఐ లైక్ ఆల్ ఆఫ్ యూ! ముఖ్యంగా మీరంటే నా కెందుకో ప్రత్యేకమైన అభిమానం, గౌరవం. సిన్సియారిటీ, డ్యూటీ ఎవేర్‌నెస్ మీలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. మీరిక్కడ చేరి మూడు నెలలు కూడా కాలేదని తెలిసింది. ఇంకొద్ది నెలలు పోయాక పర్సనల్లీ ఐ విల్ రెకమెండ్ యువర్ కేస్ ఫర్ ఎ ప్రమోషన్. మీకు తెలుసు గదా! ఉద్యోగాలు యివ్వడానికి గాని, ప్రమోషన్లు యివ్వడానికి గాని, అవసరమైతే తొలగించడానికి గాని అధికారాలు ఈ సీట్‌కు మాత్రమే వున్నాయని" అన్నాడు గర్వంగా చూస్తూ.

ఇంతకీ అతను చెప్పదలుచుకున్నదేమిటో సుమతికి అర్థం కావడం లేదు. 'ఇంటికి వెళ్ళబోయే సమయంలో పిలిపించి తనకు యిదంతా ఎందుకు చెపుతున్నాడు? స్టాఫ్ కూడా అందరూ వెళ్ళిపోయారు. స్టాఫ్ యితన్ని గురించి రకరకాలుగా చెప్పుకుంటారు. మనిషి ఎంత అందంగా వుంటాడో ప్రవర్తన అంత వ్యతిరేకంగా వుంటుంది. ఇటీవలే ఎం.బి.ఎ. పూర్తి చేసి వచ్చాడు. ఇంకా పెళ్ళి కాలేదు. స్నేహితులు, పార్టీలు, గర్ల్ ఫ్రెండ్స్ అంటూ బాధ్యతా రహితంగా తిరుగుతుంటే అతని తండ్రి రామ్మోహనరావు గారు ఆ సీట్లో మంచి తను తప్పుకొని కొడుకుని కూర్చోబెట్టారు. కాస్త బాధ్యత, బరువు అప్పచెప్పితే దార్లో పడతాడని తండ్రి ఆశపడ్డాడు. చనిపోయిన తన భార్య పేరిట రామ్మోహనరావు గారు స్థాపించిన యిండస్ట్రీ యిది. వ్యాపారం అభివృద్ధి చేయడంలో తల మునకలుగా మునిగిపోవడంతో కొడుకుని గురించి తగిన శ్రద్ధ తీసుకోలేకపోయాడు. పని మనుషుల పెంపకంలో, తల్లి శిక్షణ లోపించిన రవీంద్ర అల్లరి చిల్లరి మనస్తత్వంతో పెరిగాడు...'

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు రవీంద్ర. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది సుమతి.

"రేపు నా బర్త్‌డే! హోటల్ మూన్‌లైట్‌లో మీరు నాతో కలిసి డిన్నరు తీసుకోవాలి. ఇది నా కోరిక" అని సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. గుండె ఆగినంత పనయింది సుమతికి. మనసులో ఏ మూలో వున్న అనుమానం నిజమైకూర్చుంది. ఇప్పుడేమిటి చెయ్యడం? ఏం సమాధానం చెప్పాలి?

మళ్ళీ రవీంద్ర చెప్పసాగాడు. "ఇదివరకు నా బర్త్‌డే అంటే స్నేహితులతో, పార్టీల్లో ఎంతో ఎంజాయ్ చేసేవాడిని. అలాంటి వాటికి నేను దూరంగా వుండాలని, బాధ్యతగా యీ కంపెనీని చూసుకోవాలని నాన్నగారి ఆశ. అందుకే ఈ సంవత్సరం నా బర్త్‌డే పార్టీ మీతో సంతోషంగా గడపాలని అనుకుంటున్నాను" అన్నాడు. సుమతికి ఏం మాట్లాడాలో కూడా తోచడం లేదు. 'రానని ఖచ్చితంగా చెప్పేస్తే? అది మనసులో పెట్టుకొని ఉద్యోగంలో మంచి తీసిపారెయ్యడు గదా! అతని మాటల్లో యిలాంటి బెదిరింపు ఏదో పరోక్షంగానే ధ్వనిస్తున్నది!'

ఇంతలో టెలిఫోన్ మోగింది. రెండు నిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేసి, "సో! రేపు సాయంత్రం ఆరింటికి మూన్‌లైట్‌లో మీ కోసం ఎదురు చూస్తుంటాను" అన్నాడు సీట్లో నుంచి లేస్తూ. మౌనంగా గది బయటకు నడిచింది సుమతి. మరో సిగరెట్టు వెలిగించి చిన్నగా నవ్వుకున్నాడు రవీంద్ర. 'కనీసం రాను అని కూడా గట్టిగా చెప్పలేదు అంటే తన ఆఫర్ ఆవిడకు అంగీకారమైనట్లే! తన స్వంత ఆఫీసులోనే యిలాంటి స్టన్నింగ్ బ్యూటీ వున్నట్టు యింతవరకు తెలీదు. ఆశపడ్డ ఆడదాన్ని అనుభవించకుండా వదలడం తనకు అలవాటు లేదు. తానిచ్చే జీతం మీద ఆధారపడి బతికే యిలాంటి యువతిని లొంగదీయడం తనకు కష్టమా?' అనుకొని ప్యూన్‌ను కేకేశాడు. రూమ్ లాక్ చేసుకోమని చెప్పి కిందికి దిగి మారుతీ కారుతో క్లబ్‌లోకి ప్రవేశించాడు.

* * * *

మూన్‌లైట్ హోటల్ పేరుకు తగ్గట్లు పున్నమి చంద్రుడిలా వెలిగిపోతూ వుంది. రూఫ్ గార్డెన్ కళకళ

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________


లాడుతూ వుంది. ప్రతి టేబిల్ దగ్గర యువతీ యువకులు జంటలుగా కూర్చొని కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఒక టేబుల్ ముందు కూర్చుని వున్నారు రవీంద్ర, సుమతి. రవీంద్ర మనసు ఆనందంతో ఉప్పొంగిపోతోంది. ఇంత సులభంగా సుమతి తన కోరికను అంగీకరిస్తుందని అతను ఊహించలేదు.

"ఈ రాత్రికి ఈ హోటల్లోనే ఒక సూట్ బుక్ చేశాను. డిన్నర్ తర్వాత కాసేపు రెస్ట్ తీసుకుందాం" అన్నాడు. అతని ఉద్దేశం అర్థమయింది సుమతికి.

"నాకేం అభ్యంతరం లేదు" మెల్లగా తలవంచుకొని చెప్పసాగింది సుమతి. "ఈరోజుల్లో ఆడపిల్ల శీలం చాలా చవక అయిపోయింది. ఒకసారి దాన్ని వదులుకుంటే ఆ తర్వాత పెద్దగా బాధపడవలసిన అవసరం లేదు. ఈ ఉద్యోగం కోసం ఒకనాడు లొంగిపోయాను. ఆ ఉద్యోగం నిలబెట్టుకోవడం కోసం యిప్పుడు మరోసారి" అన్నది. మొదట ఆమె చెపుతున్నది అర్థం కాలేదు రవీంద్రకు.

"అంటే...?" అయోమయంగా ప్రశ్నించాడు.

"ఉద్యోగం కోసం మీ తండ్రిగారిని ప్రాధేయపడినపుడు ఆయన నా నుండి కోరింది కూడా యిదే!




అందుకు అంగీకరించాను కాబట్టే ఈ ఉద్యోగం దొరికింది" అన్నది సుమతి. రవీంద్ర నిర్ఘాంతపోయాడు. అతనిలో ఆందోళన ప్రారంభమైంది. మనసంతా వికలమైపోయింది. ఒక్కసారిగా అతనిలోని ఉద్రేకానికి ఆనకట్ట పడిపోయింది. 'తన తండ్రి అనుభవించిన యువతి ఈ సుమతి' అనే ఆలోచన అతని నరాలను చిట్లించసాగింది. దాదాపు పది నిముషాలు మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత లేచి నిలబడుతూ, "ఐ యాం సారీ! మీరు యింటికి పోవచ్చు" అన్నాడు. ఒక్క క్షణం అతని వైపుచూసి బయలుదేరి వెళ్లిపోయింది సుమతి.

ఆ రాత్రి సుమతి తన డైరీలో యిలా వ్రాసుకుంది.

"నా శీలం కాపాడుకోవడానికి, ఉద్యోగం నిలబెట్టుకో డానికి యింతకంటే మరో మార్గం తోచలేదు. నా కుటుంబ పరిస్థితులు చెప్పుకుని ప్రాధేయపడగానే ఉద్యోగం యిచ్చి నాకు మహోపకారం చేసిన వ్యక్తి రామ్మోహనరావుగారు. ఈరోజు నా స్వార్థం కోసం దేవుడి లాంటి ఆయనను ఆయన కొడుకు దృష్టిలో నీచుడిగా, స్త్రీలోలుడిగా చిత్రించవలసి వచ్చింది. మనిషి సెంటిమెంట్లకు దాసుడు. దాని ఆధారంగా ఏదైనా సాధించవచ్చు. దాన్ని ఆయుధంగా చేసుకొని ఈరోజు నా శీలాన్ని కాపాడుకున్నాను. ఆ రామ్మోహనరావుగారు, దేవుడు నన్ను క్షమించు గాక!"




**రామారావు, కృష్ణమూర్తి ఇద్దరూ మార్కెట్ నుండి కాయగూరలు సంచుల్లో వేలాడదీసుకుంటూ వస్తున్నారు. దేశ దరిద్రాన్ని, ఆకాశానికి అంటే ధరలను, కుళ్ళిపోయిన రాజకీయాల్ని మనసు తీరా తిడుతూ మధ్యమధ్యలో కృష్ణమూర్తి ముఖం గమనిస్తున్నాడు.**

కృష్ణమూర్తి ఆ, ఊ అనటం తప్ప రామారావు మాటల్లో పాలుపంచుకోవడం లేదు. ఇదో రకం.

అంతలో కిరణ్ లూనాపై వస్తూ రామారావును చూసి లూనా ఆపి నమస్కారం చేసి, "అంకుల్ నేను ఇప్పుడు మీ ఇంటివైపే వెళ్తున్నాను. మీరు కూర్చోండి. నేను మీ ఇంటివద్ద డ్రాప్ చేస్తాను." దానికి రామారావు కృష్ణమూర్తిని చూపించి, "ఇద్దరం కలిసే వచ్చాం. కలిసే వెళ్తాం నీవు వెళ్ళు కిరణ్. ఈ వయసులో ఈ మాత్రం బరువు మోసుకుంటూ వెళ్ళటమే ఆనందం." దానికి కిరణ్ జవాబు చెప్పకుండా లూనాపై వెళ్ళిపోయాడు. రామారావు చేసిన పనికి కృష్ణమూర్తి విసుక్కుంటూ, "ఏమయ్యా! ఇప్పుడే చేయి లాగుతోందని అన్నావు. ఆ అబ్బాయి సహాయం చేస్తానంటే ఎందుకు ఒప్పుకోలేదు? పైగా ఆ అబ్బాయి నాన్నది, మనది ఒకటే డిపార్టుమెంటు" అంటూ వాపోయాడు.

దానికి రామారావు చిద్విలాసంగా నవ్వి, "చూడు మూర్తి గారూ, ఆ అబ్బాయి ఇప్పుడు "సహాయం" అనే పేరుతో సంచి తీసుకుని మా ఇంటికి వెళ్తాడు. ఇంటికి సంచి తెచ్చి ఇచ్చినందుకు మా ఆవిడగారు కూర్చోమంటారు. అదీగాక, ఇంజనీర్‌గారి అబ్బాయి కాబట్టి సభ్యత కోసం అమ్మాయిని కాఫీ తీసుకురమ్మంటుంది. మా అమ్మాయి కాఫీ తీసుకువస్తుంది. మా అమ్మాయి అందగత్తె. వయసులో వుంది. కుర్రాడు ఎర్రగా, బుర్రగా వున్నాడు. నవనాగరికతతో మరీ బాగున్నాడు. అమ్మాయిని చూసి హీ... హీ... అంటాడు. తరువాత కాలేజీలో పరిచయాలు, క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు, షికార్లు, పార్కులు, ఒంటరి రూములు — కొన్నాళ్ళు పోయాక అమ్మాయి మామిడి కాయలు చాటుగా తింటుంది.

"అప్పుడు వాళ్ల నాన్న దగ్గరికి వెళ్ళి కథంతా ఫ్లాష్ బాక్‌లా వినిపిస్తే — మన డిపార్టుమెంటు ఒకటే అయినా సీటులో డిఫరెన్స్ చూపిస్తాడు. మాది ఇంజనీరింగ్ కులం, మీది క్లరికల్ కులమని వివరిస్తాడు. మీకూ, మాకూ ససేమిరా కుదరదని తెలుగు సినిమా హీరో తండ్రిలా పోజు పెడతాడు. కిరణ్ వర్షాకాలం సూర్యుడవుతాడు. ఒకవేళ కనిపించినా నాకు మీ అమ్మాయికి సంబంధం లేదంటాడు. దాంతో నేను హాస్పిటల్ చుట్టూ తిరగాల్సివుంటుంది. అందుచేత చిన్న సహాయాన్ని తీసుకుని బాధలు కొని తెచ్చుకోవడం నాకు ఇష్టంలేదు" అంటూ ముగించాడు.

కృష్ణమూర్తి యథాప్రకారం ఆ, ఊ, అనటము లేదు."ఒక్క "వాక్యం" వెనుక ఇంత "కహానీ" వుందా గురువా" అంటూ పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకున్నాడు. కారణం తన 16 సంవత్సరాల అమ్మాయికి ఫ్రీగా ట్యూషన్ చెప్పే మదన్ గుర్తుకు వచ్చాడు.